ప్రజాశక్తి

బుధవారం 11 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అన్నదాత సుఖీభవ కుదింపు

- 2 లక్షల మందికి అర్హత
- 50 వేల మందిపై వేటు
- సాయంలో కోత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం లబ్ధిదారులపై కూటమి ప్రభుత్వం వేటు వేసింది. వివిధ రకాల ఆంక్షలతో లబ్ధిదారుల సంఖ్యను కుదించింది. గత ప్రభుత్వంలో 2.51 లక్షల మందికిపైగా రైతు భరోసా కింద రైతులు లబ్ధిపొందారు. కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ రికార్డుల ఆధారంగా రైతుల యాజమాన్య రికార్డులు తనిఖీచేయాలని నిర్దేశించింది. ఈ తనిఖీల్లో రెండు లక్షల మందిని అర్హులుగా నిర్ధారించి వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఆన్‌లైన్‌లో నమోదైన రైతు రికార్డుల ఆధారంగా గత నెల 25 వరకు తనిఖీచేశారు. ఈ తనిఖీల్లో రైతుల వద్ద పట్టాదారు పుస్తకం ఉండి, ఆన్‌లైన్‌కాని వారిని పక్కనబెట్టారు. ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోలేని వేలాది మంది రైతులు అన్నదాత సుఖీభవ సాయానికి దూరంకానున్నారు. గత ఎన్నికల్లో రైతు భరోసాను రూ.20వేలకు పెంచి చెల్లిస్తానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ హామీ ప్రకారం రూ.20వేలు రైతు ఖాతాలో జమచేయకుండా, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు తనిఖీలు చేయించారు.

అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అన్నదాత సుఖీభవ నిధులు కూటమి ప్రభుత్వం రైతుకు జమచేయలేదు. రెండో ఏడాది ఆరంభంలో ఖరీఫ్ సీజన్‌లో సుఖీభవ నిధులు జమవుతాయని ఆశతో రైతు ఉండగా, దాదాపు 50వేల మందిని తగ్గించి నిరాశపర్చింది. ఈ నెలలో పిఎం కిసాన్ కింద రూ.2 వేలు జమకానున్నాయి. ఈ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సాయం రూ.5 వేల రైతుల ఖాతాలో జమకానున్నాయి. జిల్లాలో ఐదు లక్షల మంది రైతులున్నారు. వ్యవసాయం చేసేవారిని రైతుగా గుర్తించింది. ఆన్‌లైన్ రికార్డుల ఆధారంగా అర్హులుగా తేల్చింది. రైతు సేవా కేంద్రాల వారీగా చేసిన రీ సర్వేలో ఐదు లక్షల రైతుల్లో ఇకెవైసి పూర్తిచేసిన రెండు లక్షల మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు జమకానున్నాయి. కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీచేయకపోవడంతో ఈ నెలలో వేయబోయే సాయం కౌలురైతుకు దక్కే అవకాశంలేదు.

గత నెల 25వ తేదీతో రికార్డు వెరిఫికేషన్ పూర్తిచేసి అర్హతకల్గిన రైతు జాబితాను ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదించింది. ఈ డేటాను రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా జల్లెడ పట్టనున్నారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలు వ్యక్తమైతే మళ్లీ ఇకెవైసి చేయాల్సివుంది. అయితే, ఇకెవైసి చేశాక అన్నదాత సుఖీభవ తొలి విడత నిధులు జమవుతాయన్న గ్యారంటీలేదు. ఆన్‌లైన్‌లో భూ రికార్డులకు సంబంధించిన వివరాల నమోదులో దొర్లిన పొరపాట్లను ఎప్పటికప్పుడు తహశీల్దార్ కార్యాలయంలో సరిచేయాల్సివుంది. ఈ సమస్యలు కొనసాగినంతకాలం సుఖీభవ సాయం రైతుకు చేరదు.

రాజకీయాలకతీతంగా...

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

సమీక్షా సమావేశంలో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఈ నెల 21వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో రాజకీయాలకతీతంగా అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని సాగరిక కన్వెన్షన్ హాలులో యోగా డే నిర్వహణ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ఒకే ప్రాంతంలో 5లక్షల మందితో నిర్వహించే ఈ ఈవెంట్ ప్రపంచంలోనే అతిపెద్దదిగా చరిత్ర సృష్టించబోతోందన్నారు. ప్రధాని మోడీ హాజరు కాబోతున్న నేపథ్యంలో అధికారులంతా పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.

ప్రతి కంపార్ట్‌మెంట్‌కూ ఒక గెజిటెడ్ అధికారి

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి రాష్ట్రస్థాయి నోడల్ ఆఫీసర్‌గా నియమితులైన ఎమ్‌టి.కృష్ణబాబు మాట్లాడుతూ, యోగాడే నిర్వహించే 247 కంపార్ట్ మెంట్లలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి కంపార్ట్ మెంట్‌కూ ఒక గెజిటెడ్ అధికారికి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలంతా ఇప్పటికే

రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, క్యూఆర్ కోడ్ ద్వారా వారిని నిర్ణీత కంపార్ట్‌మెంట్లలోకి అనుమతిస్తామని వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారిని రాత్రి 2గంటలనుంచే అనుమతించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. జనాన్ని తీసుకొచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధీకరించేందుకు వీలుగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, 1200 కెమెరాలను అమర్చామని చెప్పారు. ఆర్‌కె బీచ్ నుంచి భీమిలివరకు 30 ప్రధాన లోకేషన్లతోపాటు మరో 18అదనపు లోకేషన్లలో కూడా ఏర్పాట్లుచేశామని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం 2వేల మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లకు

మిగతా 2లో..

హామీల అమలుకు విశాఖ డెయిరీ కార్మికుల నిరసన

▶ వార్త మెయిన్ 2లో..

హత్య కేసు నిందితుడిని అప్పగించాలని ఆందోళన

▶ వార్త 3లో..

ఫీ'జులుం'పై ఎస్ఎఫ్ఐ ధర్నా

▶ వార్త 4లో..

దేవాదాయ శాఖలో బదిలీలు

విశాఖలో తొమ్మిది మందికి స్థానచలనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :

దేవాదాయ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా 34 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామమోహనరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. వీరిలో 9 మంది విశాఖ నగరానికి చెందినవారు ఉన్నారు. సింహాచలం దేవస్థానానికి చెందిన వారు ఏడుగురు ఉన్నారు. బదిలీ అయినవారిలో సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.రాంబాబు, అసిస్టెంట్ ఇంజినీర్ డివిఎస్ రామరాజు, సూపరింటెండెంట్ పి.సునీల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు బి.అనురాధ, బి.వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్లు ఎన్.కార్తీక్‌నాగ్, బాలభాస్కరసాయి ఉన్నారు. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ ఎన్.శ్రీను, టి.రేవతిదేవికి కూడా బదిలీ అయ్యారు. వీరిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. మిగిలిన వారు అరసవిల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం, విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కు బదిలీ కాగా, ముగ్గురు సింహాచలం నుంచి, నగర పరిధిలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి బదిలీ అయ్యారు.

గీతం కోర్సులకు ఎన్‌బిఎ గుర్తింపు

వార్త 3లో. ▶

పరిశ్రమల స్థాపనకు ప్రాముఖ్యం

- ఉత్తరాంధ్రకు ఈ ఏడాది రూ. 1.50లక్షల కోట్ల పెట్టుబడులు
- వెల్లడించిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

పరిశ్రమలతోనే దేశం, రాష్ట్రాల అభివృద్ధి జరుగుతుందని, అందుకే కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు ప్రాముఖ్యత ఇస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ చెప్పారు. బీచ్ రోడ్డులోని గ్రాండ్ బే హోటల్‌లో మంగళవారం జరిగిన ఫ్యాప్సీ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన అవార్డుల వేడుకలో ఆయన మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రూ.9.20 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని, ఇందులో భాగంగా ఈ ఏడాది ఉత్తరాంధ్రలో రూ.1.5 లక్షల పెట్టుబడులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టనున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ నాయకుడని, ఆయన పాలనలో అమరావతి కూడా హైదరాబాద్ స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనేక సవాళ్లు...ఎంపీ శ్రీ భరత్

ఫ్యాప్సీ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా విశాఖ ఎంపీ శ్రీభరత్ హాజరై మాట్లాడుతూ, భోగాపురం ఎయిర్ పోర్టు ఏడాదిలో సిద్ధం కావాలని ప్రభుత్వం అన్ని వైపుల నుంచి ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ద ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఏర్పడిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఫ్యాప్సీ ఎక్సలెన్స్ అవార్డులు ఇవ్వాలని రెండేళ్ల క్రితం నిర్ణయం తీసుకున్నామని ఇప్పుడు సాధ్యమైందని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో అభివద్ధిని సాధించిన పరిశ్రమలకు, పారిశ్రామికవేత్తలకు

మిగతా 2లో..

ఫ్యాప్సీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

రాజకీయాలకతీతంగా యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

బాధ్యతలు అప్పగించామని, వారందరినీ ముందురోజు రాత్రే ఎయు గ్రౌండ్స్‌కు రప్పిస్తామని చెప్పారు. ముందుజాగ్రత్త చర్యగా 116 అంబులెన్స్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. హాజరయ్యే వారందరికీ మ్యాట్‌లు, టీషర్టులు ఆయా కంపార్ట్‌మెంట్ల వద్దే అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. విశాఖతోపాటు పరిసర జిల్లాల నుంచి వచ్చే ప్రజల కోసం 3,500 ఆర్‌టిసి బస్సులు, 8వేల ప్రైవేటు, స్కూలు బస్సులను సిద్ధంచేశామని చెప్పారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయుస్వామి, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసద్, గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ హరేంధిరప్రసాద్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రాముఖ్యం

11ఫ్యాప్సీ ఎక్సలెన్స్ అవార్డులను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమల అభివద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి తద్వారా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ అవార్డుల వేడుకల్లో ప్రముఖులు గోయంకా, పైడా కృష్ణప్రసాద్, ఫ్యాప్సీ డైరెక్టర్ హేమ, చైతన్య, పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగదీశ్వరరావు, నరవ ప్రకాశరావు తదితరులు

బాల కార్మికులు లేని సమాజం రావాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాల కార్మికులు లేని సమాజం ఏర్పడాలని ఎస్‌విపిపి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు ఆకాంక్షించారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం ఈ నెల12వ తేదీని పురస్కరించుకొని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మంగళవారం ఎంవిపి కాలనీలోని ఎస్‌విపిపి డిగ్రీ కళాశాలలో "పనిచేయడం పెద్దల వంతు బడికి వెళ్లడం పిల్లల వంతు" అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ప్రిన్సిపల్ కె.జగదీశ్వరరావు, బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖ నగరంలో రోజురోజుకూ బాల కార్మికులు పెరుగుతున్నారన్నారు. విద్యా హక్కు చట్టాన్ని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబ్జి, డాక్టర్ అప్పారావు, ప్రియాంక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండాకు ఘన నివాళి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : భగవాన్ బిర్సా ముండా 124వ వర్ధంతిని పురస్కరించుకొని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎంవిపి కాలనీలోని గిరిజన భవన్‌లో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి శోభన్ కుమార్ మాట్లాడుతూ, భగవాన్ బిర్సా ముండా పోరాట స్ఫూర్తితో ఒక ప్రభుత్వ రంగ సంస్థ మీద ప్రభుత్వం సరైన విధానం ప్రకటించకుండా ద్వంద్వ వైఖరి అవలంభించడం హేయమైన చర్య అన్నారు. దీన్ని ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి ఉద్యోగ సంఘాలే కాకుండా అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలూ ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సీసా సోభన్, భవన్ ట్రెజరర్ దేపూరు పూజ్యశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన ఉద్యోగులు

మహిళా రక్షణలో ప్రభుత్వం విఫలం

వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న వైసిపి మహిళా నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు పేడాడ రమణికుమారి, మాజీ మేయర్ గొలగాని వెంకట హరికుమారి, రాష్ట్ర కార్యదర్శి ఈర్లె అనూరాధ ఆరోపించారు. ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలు సేవ్ ఉమెన్,సేవ్ ఆంధ్ర ప్రదేశ్ అని నినాదాలు చేస్తూ మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మహిళలు, బాలికలకు భద్రత కరువైందని ఆరోపించారు. తమ పార్టీ నాయకులపై కక్షతో అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. పోలీసులు శాంతిభద్రతలను మంట గలుగుతున్నారని ఆరోపించారు. మహిళలకు భద్రత కల్పించడంలో విఫలమైన మహిళా హోం మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, నాయకులు పల్లా చినతల్లి, పప్పుల సునీత, బి. పద్మావతి, రీసు అనురాధ, బొర్రా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న టిడిపి మహిళా నేతలు

మహిళలపై చులకన భావం వీడాలి

టిడిపి మహిళా నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రుల రాజధాని అమరావతి మహిళలను కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. జిల్లా టిడిపి కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి మీడియాను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గనగళ్ల సత్య, దవల విజయ కుమారి, అవ్వ కాంతం తదితరులు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ సముదాయాల వేలానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎచే నిర్మించిన షాపులు, ఆఫీసులు, ఖాళీ స్థలాలు నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికపై ఇచ్చుటకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విస్తీర్ణం, అద్దె, విఎంఆర్‌డిఎ అప్సెట్ ధర తదితరాలు వెబ్ సైట్ www.vmrda.gov.in లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ షాపులు, ఆఫీసులు ఖాళీ స్థలాలు యథాతథంగా మూడేళ్ల కాల పరిమితి కోసం నెలసరి అద్దె ప్రాతిపదికపై వేలం వేయనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు, దరఖాస్తులను విఎంఆర్‌డిఎ వెబ్ సైట్ నందు గానీ సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలోగాని పొందవచ్చని పేర్కొన్నారు దరఖాస్తుతో పాటుగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (వుడా బ్రాంచ్) సిరిపురంలో దరఖాస్తు రుసుం ఒక్కింటికి రూ.2,000 చలానా రూపంలో చెల్లించి, దరావత్తు సొమ్ము ఒక్కింటికి రూ.50 వేలు, ది మెట్రోపాలిటన్ కమిషనర్, విఎంఆర్‌డిఎ విశాఖపట్నం పేరున డీడీ తీసి కార్యాలయంలో ఈ నెల 9 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, పిహెచ్‌సి కేటగిరీకి చెందిన వారు కులం, సంబంధిత ధ్రువపత్రాలను జతపరచాలని పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'హిందూ ఆచారాలను లోకేష్ భ్రష్టు పట్టించారు'

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం మృతిచెందడంతో మంగళవారం పూట వారి ఇంటికి మంత్రి నారా లోకేష్ పరామర్శకు వెళ్లడం హిందూ ఆచారాలను భ్రష్టు పట్టించినట్లేనని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. పాత వెంకజిపాలెంలోని శివాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కనీస అవగాహన లేకుండా సంప్రదాయాలను పాటించకుండా పరామర్శకు వెళ్లడం పట్ల హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఒక రాష్ట్రానికి మంత్రి అయివుండి, కాబోయే ముఖ్యమంత్రి అని ప్రచారం చేసుకుంటున్న నారా లోకేష్‌కు హిందూ సంప్రదాయం పట్ల కనీస అవగాహన లేకపోవడం దారుణం అన్నారు.

'క్వాలిటీ సర్టిఫికెట్'తో ఆశీర్వాద్ ఆటా

ప్రజాశక్తి -ఎంవిపి-కాలనీ : గోధుమ పిండి బ్రాండ్‌గా పేరుగాంచిన ఆశీర్వాద్ ఆటా దక్షిణ భారతదేశంలో 'క్వాలిటీ సర్టిఫికెట్' ప్రారంభంతో 'నాణ్యత హామీ'తో వస్తుందని ఐటిసి ఫుడ్స్ స్టేపుల్స్ అండ్ అడ్జసెన్సీస్ అధికారి అనుజ్ కుమార్ రుస్తగి చెప్పారు. బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన టీవీసీని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆశీర్వాద్ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటి స్నేహాను పున్న పరిచయం చేసిందన్నారు. ప్రతి ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ ఆటా ప్యాక్ ఇప్పుడు క్వాలిటీ సర్టిఫికెట్‌తో అందజేస్తున్నామన్నారు.

మృతదేహం కోసం పడిగాపులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కుటుంబ పెద్ద మృతి చెంది రెండు రోజులు అయి పోస్టుమార్టం పూర్తయినప్పటికీ, మృతదేహాన్ని అధికారులు అప్పగించని పరిస్థితి నెలకొంది. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సర్దాపూర్ గ్రామానికి చెందిన జుగ్గి లక్ష్మయ్య (60) గత నెల 31న ఇంట్లో కాలు జారి పడిపోయాడు. స్థానిక ఆసుపత్రిలో ఆయనకు చికిత్స అందించారు. అక్కడ నుంచి జూన్ 1వ తేదీన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కెజిహెచ్ కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ సోమవారం ఆయన మృతి చెందారు. కెజిహెచ్‌లో ఎంఎల్ సి (మెడికల్ లీగల్ కేస్) నమోదైంది. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసుల ద్వారా ఒడిశా పోలీసులకు సమాచారం అందించారు. ఒడిశా పోలీసులు వచ్చి శవపంచనామా చేసిన తర్వాత మాత్రమే మృతదేహాన్ని అప్పగించడం జరుగుతుందని కెజిహెచ్ అధికారులు స్పష్టం చేశారు. అయితే లక్ష్మయ్య ఇంటిలోనే మృతి చెందారని ఇందులో తమకు ఎటువంటి అనుమానం లేదని, కనుక మృతదేహాన్ని అప్పగించాలని మతుని భార్య, కుమార్తె కోరుతున్నారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ఘనంగా గంగమ్మతల్లి పండగ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 14 అర్ధరాత్రి దాటాక బోట్లు చేపల వేటకు వెళుతున్న నేపథ్యంలో మంగళవారం సంప్రదాయంగా గంగమ్మతల్లి పండుగను ఫిషింగ్ హార్బర్‌లో ఘనంగా నిర్వహించారు. భక్తులు గంగాదేవికి పసుపు, కుంకుమ, మొక్కుబడులు సమర్పించుకొన్నారు. షిప్పింగ్ హార్బర్‌లో గంగమ్మతల్లి మహోత్సవంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రసాదాల పంపిణీ కౌంటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మరపడవల సంఘం అధ్యక్షులు ఎం. లక్ష్మణరావు, గౌరవాధ్యక్షులు అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్. నర్సింగరావు, కార్యదర్శి మున్నం బాలాజీ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ విజయవాడ
ఇ.ఎ. 16 ఆఫ్ 2023
బిట్వీన్:
రాపేటి వెంకటరావు మరియు 2 అదర్స్
..పిటీషనర్స్/డిక్రీ హోల్డర్స్/కంప్లయినెంట్స్
అండ్
M/s. సహార ఇండియా, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్స్ మరియు 4 అదర్స్
...రెస్పాండెంట్లు/జె.డి. ఆర్స్/ఆపోజిట్ పార్టీస్
నోటీసు
టు
రెస్పాండెంటు నెం. 1: **M/s. సహార ఇండియా, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్,** చోడవరం, విశాఖపట్నం జిల్లా-531 036.
రెస్పాండెంటు నెం. 2: **M/s. సహార ఇండియా, రిప్రజెంటెడ్ బై ఇట్స్ సెక్టార్ మేనేజర్,** 3వ అంతస్తు, కళ్యాణీ ఎస్టేట్స్, దొండపర్తి, విశాఖపట్నం-16.
రెస్పాండెంటు నెం. 5: **M/s. సహార క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్,** రిప్రెజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, చోడవరం, విశాఖపట్నం జిల్లా -531036
(IA/343/2025 లోని రాష్ట్ర కమీషన్ ఆదేశాల ప్రకారం ఈ నోటీసు మీకు జారిచేయబడినది.)
పై పిటీషనర్స్/డిక్రీహోల్డర్స్/కంప్లయినెంట్స్ అయిన శ్రీ రాపేటి వెంకటరావు మరియు 2 అదర్స్ వార్లు ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్రస్సల్ కమీషన్, విజయవాడలో C.C.49/2019 ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడలో పై నెంబరు పిటీషన్ E.A.16/2023 in C.C.49/2019 పై పిటీషనర్లు దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ లో మీయొక్క హాజరు కొరకు తేది. **30-06-2025** కి వాయిదా అయివున్నది. కావున పైతెలిపిన **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, అశోక్ నగర్, విజయవాడ** నందు **తేది. 30-06-2025** ఉ॥గం॥**10.30** ని॥లకు మీరు స్వయంగా గానీ లేదా మీ తరుపున న్యాయవాది గారి ద్వారాగాని హాజరై మీయొక్క అభ్యంతరములు, ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమందు తీర్మాణించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.
B.L.V. PHANESH KUMAR, Advocate
Vijayawada, **Cell: 98482 64075**

సవరణ
తే: 10-6-25దీని ప్రజాశక్తిలో ప్రచురింపబడిన పబ్లిక్ నోటీసులో ముద్రించిన విజ్ఞాన్ పబ్లిక్ స్కూలుకి బదులుగా గాయత్రి పబ్లిక్ స్కూలుగా గమనించగలరు.
వై.చిన్నారావు అడ్వకేట్, వి.మాడుగుల
సెల్: 984966356

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S.307/2018
Between:
Molleti Parvatheesam ...Plaintiff
And:
Koribilli Lakshmibai & others ...Defendants
SUMMONS
To,
D-13: Pentakota Vijayalakshmi,
W/o. Late Hariprasad,
Hindu, aged 41 years,
R/at D.No.44-28-12,
Opp. to Sri Lakshmi Residency,
Railway New Colony,
Visakhapatnam.
Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the defendants for partition of the plaint schedule property and for other reliefs and the suit stands posted to **20-06-2025** for your appearance either in person or through a Pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
K. GOVINDA RAJU,
P. DILEEP KUMAR,
Advocates,
Visakhapatnam.
Cell: 9246613978, 9704745403.

భరోసా ఎప్పుడో.?

- కొత్త పింఛన్లకు ఎదురుచూపులు
- ఎవరికి, ఎపుడిస్తారో కానరాని స్పష్టత
- అయోమయంలో అర్హులైన దరఖాస్తుదారులు
- 12న వితంతు పెన్షన్లకు మోక్షం?

ప్రజాశక్తి - భీమునిపట్నం : ఎన్‌టిఆర్ భరోసా సామాజిక కొత్త పింఛన్ల కోసం అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు కొంతకాలంగా ఎదురుచూపులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందన్న భావించిన అనేకమంది అర్హుల ఆశలు నేటికీ నెరవేరని పరిస్థితి ఉంది. వితంతు పింఛన్లకు సంబంధించి కటాఫ్ తేదీలను ప్రకటించి, కొంతమందికి మంజూరుచేసినా, వృద్ధులు, వికలాంగులు, ఇతర కేటగిరీలకు పెన్షన్ల మంజూరుకు ఎటువంటి ప్రక్రియ చేపట్టకపోవడంతో ఆందోళన వ్యక్తమౌతోంది.

గత వైసిపి హయాంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హులైన వారికి జనవరి, ఆగస్టు నెలల్లో ఆరునెలలకోసారి పింఛన్లు మంజూరు చేసేవిధానం కొనసాగగా, ఇపుడు కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఏ ప్రాతిపదికన పెన్షనర్లను గుర్తిస్తారనేది ఇప్పటికీ స్పష్టత లేదు. కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అర్హుల గుర్తింపు వంటి కీలక అంశాలేవీ ముందుకు రాలేదు. అయితే పెన్షన్‌దారుడైన భర్త చనిపోతే, మరుసటి నెలనుంచే భర్త పెన్షన్‌ను భార్యకు వితంతు పింఛనుగా ఇస్తామని ప్రకటించి అమలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం చనిపోయిన వారికి మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుండగా, ఇంతకు ముందు భర్తలను కోల్పోయిన వితంతువుల పరిస్థితి ఏంటనేది నేటికీ స్పష్టత రాలేదు.

2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు భర్తలు చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మంజూరు చేస్తారన్న ప్రచారం జరిగినా అది ఎప్పుడిస్తారో తెలియడం లేదు. అంతేకాక అంతకుముందు భర్తలు చనిపోయిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక వృద్ధులు, వికలాంగులు, ఇతర కేటగిరీలకు సంబంధించి పిజిఆర్ఎస్‌ల్లో ఇచ్చే దరఖాస్తులే తప్ప, వీటి కోసం ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన వంటి ప్రక్రియలేమీ చేపట్టడంలేదు. దీంతో ఆయా కేటగిరీలకు ఇప్పట్లో పింఛన్లు ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? లేదాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని 21 వార్డు సచివాలయాల పరిధిలో 2023 డిసెంబర్ నాటికికొత్తగా పింఛన్ల కోసం 219 దరఖాస్తులు ఏడాది పైబడి పెండింగులో ఉన్నట్టు సమాచారం. ఇక నాలుగు వార్డుల పరిధిలో వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నవారు 95మంది ఉన్నారు.ఇక ఈనెల 12వ తేదీన కొత్త పింఛన్లు ఇస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అన్ని కేటగిరీలవారికి ఇస్తారా? లేక తాజా ప్రకటనల మేరకు కేవలం వితంతవులకు ఇస్తారనే విషయంలోనూ స్పష్టత లేదు. కొత్త పింఛను కోసం ఎదురుచూస్తున్న వారికి ఎప్పటికి మోక్షం కలుగుందో చూడాలి.

పింఛను పునరుద్ధరించాలి

నా భర్త చనిపోయి 26 ఏళ్లు అవుతుంది. గతంలో ఇచ్చిన పింఛనును 2020లో అర్ధాంతరంగా ఆపేశారు. ఎందుకు ఆపేశారని ఎవరిని అడిగనా చెప్పడం లేదు. కొత్త ప్రభుత్వమైనా పింఛను పునరుద్ధరించాలి

- కర్రి ఈశ్వరమ్మ, వితంతువు
వేలంపేట , జివిఎంసి ఒకటో వార్డు

కాళ్లరిగేలా తిరిగినా..

ఏడాది క్రితం భర్త చనిపోయాడు. పిల్లలు లేవు. ఒంటరిజీవితం. రూ.రెండు వేలు చెల్లించి అద్దింట్లో ఉంటున్నారు. పింఛను కోసం సచివాలయం చుట్టూ ఏడాదిగా కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేదు.

- షేక్ ఫకీరమ్మ, వితంతువు
నగరపు వీధి, జివిఎంసి ఒకటో వార్డు

అర్హత ఉన్నా అందని పింఛను

నా వయస్సు 70 ఏళ్లు. ఏడాది క్రితం భర్త చనిపోయాడు. వృద్ధాప్య, వితంతు పింఛన్లకు అర్హురాలిని. పొగాకు చుట్టలు చుట్టి, వచ్చిన కూలితోనే కష్టంగా బతుకు వెల్లదీస్తున్నాను. పింఛను వస్తుందన ఆశ ఎప్పటికి నెరవేరుతుందో..

- కానూరి సత్యవతి
రాజవీధి, జివిఎంసి ఒకటో వార్డు

గీతం కోర్సులకు ఎన్‌బిఎ గుర్తింపు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అందిస్తున్న వివిధ కోర్సులకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ) గుర్తింపు లభించిందని గీతం ఇంటర్నల్ క్వాలిటి ఎస్యూరెన్స్ సెల్, అక్రిడిటేషన్, ర్యాంకింగ్ విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజా ప్రభు తెలిపారు. ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందే క్రమంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి ఎన్‌బిఎ గుర్తింపు లభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, అంతర్జాతీయంగా విశ్వవిద్యాలయంగా విద్యార్థుల అవకాశాలను మెరుగు పరుస్తుందన్నారు.

దేశంలోని అతి కొద్ది విశ్వవిద్యాలయాలకు మాత్రమే ఎన్‌బిఎ గుర్తింపు ఉందన్నారు. వర్సిటీలో. కోర్సుల నిర్వహణలోనాణ్యత ప్రమాణాలు, బోధన పద్ధతులు, విద్యార్థులలో నైపుణ్యాలు వంటి వివిధ అంశాలను మదింపు చేసిన అనంతరం ఎన్‌బిఎ నిపుణల కమిటి గీతం కోర్సులకు ఎన్‌బిఎ గుర్తింపును ప్రకటించిందన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నాణ్యిత ప్రమాణాలకు ఇస్తున్న ప్రాధాన్యతకు గుర్తింపుగా ఇప్పటికే నాక్ ఎ++ గ్రేడ్‌తో పాటు ఎన్‌ఐఆర్‌ఎఫ్. ర్యాంకింగ్‌ను, క్యూఎస్ ఆసియా విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌ను, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ ర్యాంకింగ్‌ను సాధించిందని తెలిపారు.

గీతం విశ్వవిద్యాలయం

హత్య కేసు నిందితుడిని అప్పగించాలని ఆందోళన

- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం
- రూ.60 లక్షల పరిహారమిచ్చేందుకు కుదిరిన ఒప్పందం

పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని గ్రామస్తులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు బొగ్గు హ్యాండ్లింగ్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి సోమవారంహత్యకు గురైన సంఘటన వివాదంగా మారింది. నిందితుడినితమకు అప్పగించాలని కోరుతూ మృతుని సంబంధీకులు మంగళవారం హార్బర్ పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలివి.. విశాఖపట్నం పోర్ట్‌లో జిస్టార్ అనే బొగ్గు హ్యాండ్లింగ్ కంపెనీలో రాయపాటి సత్యనారాయణ సెక్యూరిటీ సూపర్వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈయన కంచరపాలెం రౌడీషీటర్. సబ్బవరం మండలం గుల్లిపల్లి గ్రామానికి చెందిన గొంప సన్యాసిరావు (38) డ్రైవర్‌గా, విశాఖ నగరంలోని బీమ్ నగర్‌కు చెందిన షేక్ నాగూర్ కళాసిగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ డ్యూటీలో ఉండగా రెండు బొగ్గు లారీలు కనపడకుండా పోయాయని, సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యజమాని అనామ్ ఉల్లాఖాన్, సూపర్వైజర్ రాయపాటి సత్యనారాయణ వారిని నిలదీసి ప్రశ్నించారు. వివాదం పెరిగి ఘర్షణ జరిగింది. సెక్యూరిటీ సూపర్వైజర్ రాయపాటి సత్యనారాయణ లారీలో ఉన్న జాకీతో గొంప సన్యాసిరావు తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ముందు కెజిహెచ్‌కు తర్వాత ఆయుష్మాన్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే సన్యాసిరావు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురీకి తరలించారు. గొడవలో గాయపడ్డ కళాసి షేక్ నాగూర్‌ను సెవెన్ హిల్స్ ఆసుపత్రిలోచికిత్స పొందుతున్నాడు.

డ్రైవర్ సన్యాసిరావు మరణించిన సమాచారం తెలియడంతో, ఆయన స్వగ్రామానికి చెందిన వందలాదిమంది మంగళవారం హార్బర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సన్యాసిరావును హత్య చేసిన సత్యనారాయణ తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో హార్బర్ స్టేషన్ సిఐ ఇరువర్గాల మధ్య పలుమార్లు సంప్రదింపులు జరిపారు. దీంతో మృతుని కుటుంబానికి రూ.60 లక్షలు ఇచ్చేందుకు యజమాని అనామ్ ఉల్లాఖాన్ అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. సన్యాసిరావు మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం జరగనుంది. కేసులో ప్రధాన నిందితుడు రాయపాటి సత్యనారాయణ కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

నేరాలు ఘోరాలు

వివాదాస్పదమైన ఫోన్ మెసేజ్

- ఇద్దరి మధ్య తగాదా : యువకునికి కత్తిపోట్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అవివాహిత యువతికి ఒక యువకుడు పంపిన ఫోన్ మెసేజ్ తీవ్ర వివాదానికి దారి తీసింది. నగరంలోని జ్ఞానాపురంలో ఈ సంఘటన మంగళవారం జరిగింది. వివాదం తీవ్రం కావడంతో, ఒక వ్యక్తి, మరో వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి.

జ్ఞానాపురం బాబుల వీధికి చెందిన పెయింటర్ ముదపాక బాలరాజు మంగళవారం బైక్‌పై వెళుతుండగా, ఈ ప్రాంతంలోని బ్రిడ్జిపై , వెనుక నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన అదే వీధికి చెందిన ఎల్లంకి సాయి అడ్డగించాడు. తనకు చెల్లెలు గీతకు ఫోన్లో మెసేజ్ ఎందుకు పంపావని ప్రశ్నించాడు. తనే తనకు ముందుగా మెసేజ్ పెట్టిందని బాలరాజు చెప్పడంతో, ఆగ్రహించిన సాయి తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలరాజు మెడ, చేతి, ఛాతిపై పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాలరాజును కెజిహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతున్నాడు. నిందితుడు సాయి హార్బర్ పోలీసు స్టేషన్లో లొంగిపోయాడు.

లింగంపేటలో చోరీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని లింగంపేట గ్రామంలో బొద్దేపు అప్పలనాయుడు ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బంగారు ఆభరణాలను దొంగలెత్తుకుపోయారు. అందిన ఫిర్యాదు మేరకు కేడీపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు సంఘటనాస్థలిని సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడు

పోలీసుల వద్ద ఉన్న బాలుడు

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళవారం గుర్తు తెలియని బాలుడిని పట్టుకున్నామని సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలివి.

మధురవాడ లా కాలేజీ దగ్గర ఒకగుర్తుతెలియని బాలుడు తిరుగుతున్నాడని అందిన సమాచారం మేరకు సిబ్బంది పంపి అతనిని పోలీస్ స్టేషనుకు తెచ్చామన్నారు. వివరాలు అడిగితే, తన పేరు వాసుపల్లి చిట్టిబాబు అని, తన తల్లిపేరు జ్యోతి అని చెబుతున్నారు. ఇతర వివరాలు చెప్పలేకపోవడంతో బాలుడిని పోలీసు స్టేషన్‌లో తమ సంరక్షణలో ఉంచామన్నారు. బాబు వివరాలు తెలిసిన వారు పిఎం పాలెం పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు.

గెడ్డవాగు ఆక్రమణపై వివాదం

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని పందలపాక రెవెన్యూ పరిధిలోని పాలవలస గ్రామంలో గెడ్డవాగు ఆక్రమణపై వివాదం చెలరేగింది. సర్వే నంబర్ 85/10, 11కు ఆనుకుని ఉన్న భూముల్లో అక్రమంగా మార్గం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని భూయజమానులు ఆరోపిస్తున్నారు.

మాజీ సర్పంచ్ పాలవలస అప్పలనారాయణ మాట్లాడుతూ, వాగు పరిసరాల్లో ఉన్న జిరాయితీ భూముల్లో కక్షసాధింపుతో దౌర్జన్యంగా రహదారి వేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మల సన్యాసప్పడు తదితరులు తప్పుడు ఆరోపణలు చేస్తూ తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.. కాగా విఆర్ఒ రమేష్ నాయుడు, సర్వేయర్‌తో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడ ప్రభుత్వ బంజర భూమి కూడా ఉన్నట్టు గుర్తించామని, ఎవరూ దానిని ఆక్రమించరాదని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా కమల

ప్రజాశక్తి-వేపగుంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా కె. కమల ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని పాఠశాలలో మంచి ఫలితాలు సాధనకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, పిల్లల ప్రవర్తన తెలుసుకుంటామన్నారు

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా చేతన్‌కుమార్

చేతన్‌కుమార్

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్ చేతన్ కుమార్ నియమితుల య్యారు. జిల్లా కలెక్టర్ విడుదల చేసిన తాజా బదిలీల్లో భాగంగా ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత తహశీల్దార్ పేర్లి శ్యాంప్రసాద్‌ను విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. అతని స్థానంలో డిప్యూటీ తహశీల్దార్ ఎల్. చేతన్ కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో తాత్కాలిక ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.తాజా బదిలీల్లో భాగంగా మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రీటాను భీమిలి ఆర్‌డిఒ కార్యాలయానికి బదిలీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడ 33 /11 కెవి సబ్‌స్టేషన్‌లో 11 కెవి గ్రేహౌండ్స్, ఉప్పాడ ఫీడర్లు, భీమిలి సబ్ స్టేషన్ పాలిటెక్నిక్ కళాశాలకు అనుకుని ఉన్న ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం, మూడో జోన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాద్రి, మంగమారిపేట, తిమ్మాపురం, కాపుల దిబ్బడిపాలెం, కె నగరపాలెం, గ్రే హౌండ్స్, నేరెళ్ళవలస, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

అప్రకటిత కరెంట్ కోతతో ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి -తగరపువలస: రేయింబవళ్ళ తేడా లేకుండా కొద్ది రోజులుగా ఇష్టానుసారంగా సాగుతున్న అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి కరెంట్ కోతలు పతాకస్థాయికి చేరుకున్నాయి. మండిపోతున్న ఎండలు, ఉక్కిరిబిక్కిరితో సతమతమౌతున్న ప్రజలు, రాత్రివేళ మూడు దఫాలుగా కరెంట్ కట్ చేయడంతో పిల్లా పాపలతో అనేక అవస్థలు పడ్డారు.

మరో వైపు విద్యుత్ బిల్లులు విపరీతంగా వస్తుండడంతో వినియోగదారులు ప్రభుత్వంపై మండి పడుతున్నారు.కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని, విద్యుత్ చార్జీల బిల్లుల భారం తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు గాల్లో కలిసిపోయాయని ప్రజలు మండిపడుతున్నారు.

వైభవంగా పైడితల్లమ్మ వార్షిక పండుగ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం సింహాద్రి అప్పన్నస్వామి సోదరి, అడివివరం పరిసర ఏడు గ్రామాల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ వార్షిక పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఇఒ వేంద్ర త్రినాధరావు పర్యవేక్షణలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉదయం మూడు గంటల నుంచే .ఆలయ అర్చకులు సంతోష్ శర్మ అమ్మవారికి విశేష పూజలు చేశారు. పైడితల్లమ్మకు సింహాచలం దేవస్థానం తరపున ఆలయ ఇఒ త్రినాధరావు దంపతులు పసుపు కుంకుమ, పండ్లు, చీర సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఎఇలు ఆనందకుమార్, రమణమూర్తి ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక గాంధీనగర్‌లోని సరిపల్లి నుంచి అమ్మవారి తిరువీధి ఉత్సవం వేడుకగా సాగింది. వేలమంది భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ములగాడ :జివిఎంసి 62వ వార్డులో జివిఎంసి నిధులతో పలు అభివృద్ధి పనులకు వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎన్‌టిఆర్ నగర్ బ్లాక్ నెంబర్ 10 వద్ద రూ.19 లక్షలతో రిటైనింగ్ వాల్, ప్రకాశ్‌నగర్‌కాలనీలో రూ.16లక్షల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు మాలినాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వహయాంలో ఐదేళ్లలో ఎటువంటి నిర్వహణ, మరమ్మతులు చేపట్టకపోవడంతో ఉన్న రోడ్లు, రక్షణగోడలు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కూటమి పాలనలో ఎమ్మెల్యే పి.గణబాబు చొరవతో నిధులు మంజూరు కావడంతో పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు దుర్గా, దిలీప్, శ్రీధర్, శ్రీను, చిట్టిబాబు, వెంకటలక్ష్మి, చండి ప్రసాద్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఫీ'జులుం'పై ఎస్ఎఫ్ఐ ధర్నా

శ్రీవిశ్వ కాలేజీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : కార్పొరేట్ విద్యాలయాల్లో అధిక ఫీజుల వసూలు, పుస్తకాలు, యూనిఫాం పేరిట వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ద్వారకానగర్ శ్రీవిశ్వ కాలేజీ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆందోళన చేపట్టారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఇంటర్మీడియేట్ విశాఖ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఒ) కాలేజీ వద్దకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. గొడౌన్‌లో ఉన్న రూ.40 లక్షల విలువైన పుస్తకాలను సీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.అజయ్ మాట్లాడుతూ జిల్లాలో నారాయణ, చైతన్య, శ్రీ విశ్వ, వంటి అన్ని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు ఇంటర్ బోర్డు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా, పుస్తకాలు, యూనిఫాం ఇతర మెటీరియల్స్ పేరిట అక్రమంగా వ్యాపారం చేస్తూ, ఒక్కో విద్యార్థినుంచి అదనంగా మరో రూ.20వేలు నుంచి రూ.50వేలు వరకు దోచుకుంటున్నారన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలఅక్రమ కార్యకలాపాలపై ప్రభుత్వం విద్యాశాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం, విద్యా శాఖ మంత్రి చొరవ తీసుకొని తల్లిదండ్రులకు అండగా ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, అన్ని కాలేజీలలో తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చెయ్యాలని, అకాడమీల పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయా విద్యాసంస్థల్లో తక్షణం తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు, ఉపాధ్యక్షుడు డి.వెంకటరమణ, నాయకులు కౌశిక్, శశికుమార్, కుసుమాంజలి, మౌనిక, ప్రగతి, కావ్య, గుణ, వినయ్, నరేష్, విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండవాలు సమస్యలను పరిష్కరించండి

- సిపిఎం ఆధ్వర్యాన దుర్గానగర్ మహిళల నిరసన

నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం నేత పైడిరాజు

ప్రజాశక్తి -ములగాడ : స్థానిక సమస్యలు పరిష్కరించాలని జివిఎంసి 62వ వార్డు దుర్గానగర్‌లో మంగళవారం ఉదయం సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలో రోడ్లు, మెట్లు, కాలువలు పూర్తిగా పాడైపోయాయని, మురుగునీరు, దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జివిఎంసికి వేలకు వేలు పన్నులు కడుతున్నా ఇక్కడి ప్రజల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలో జివిఎంసి అధికారులు పర్యటించి, ఇక్కడి సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. రోడ్డు, మెట్లమార్గం, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని, మురుగునీటి సమస్య నుంచి విముక్తి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు బి.అర్జున్, పి.వరలక్ష్మి బి.గురులక్ష్మి, సింహాద్రప్పుడు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధం

ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి

ప్రజాశక్తి- సీతమ్మధార : భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ సిఎండి ఇమ్మడి అధికారులను అప్రమత్తం చేసారు. సిఎండి ఆదేశాలతో వినియోగదారులకు 24×7 సేవలందించేందుకు కార్పొరేట్ కార్యాలయంతో పాటు సంస్థ పరిధిలోని 11 జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఎండి పృథ్వీతేజ్ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా వినియోగదారులకు సేవలందించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను ఆదేశించారు. అధికారులందరూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయవద్దని సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలిచ్చారు. విద్యుత్ అంతరాయాల సమాచారాన్ని వినియోగదారులు కంట్రోల్ రూమ్ నెంబర్లకు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

కంట్రోల్ రూం ఫోన్ నెంబర్లు

కార్పొరేట్ ఆఫీస్	: 1912
శ్రీకాకుళం	: 94906 12633
విజయనగరం	: 94906 10102
పార్వతీపురం మన్యం	: 83319 83217
విశాఖపట్నం	: 73822 99975
అనకాపల్లి	:94906 10022
అల్లూరి జిల్లా	: 94906 10027
రాజమహేంద్రవరం	: 73822 99960
కాకినాడ	:94931 78718
అంబేద్కర్ కోనసీమ	:94409 04477
ఏలూరు	:94409 02926

నేడు భీమిలి మండల సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11న బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సాధారణ సమావేశం జరుగనుందని ఎంపిడిఒ ఎస్ హనుమంతరావు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు.అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపిడిఒ కోరారు.

భూసర్వే లోపాలపై గరంగరం

- ఆనందపురం మండల సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న ఎంపిపి శారదా ప్రియాంక

ప్రజాశక్తి-ఆనందపురం : సమగ్ర భూసర్వేలో లోపాలతో రైతులు ఇబ్బందులకు గురౌతున్నారని జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు మండిపడ్డారు. రైతుల పేర్లు తారుమారు, భూవిస్తీర్ణం నమోదులో తేడాలు, ఇతర లోపాలతో రికార్డులన్నీ గందరగోళ పరిచి రైతులను అవస్థలు పాల్జేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పేరిట ఉన్న జిరాయితీ, ఇతర హక్కు భూములకు పట్టాలు జారీ చేయకుండానే పెండింగ్ పెట్టడం దుర్మార్గమన్నారు.

మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి సమన్వయంతో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. భూసర్వే, వ్యవసాయం, గృహనిర్మాణం, విద్యుత్, తాగునీటి సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.

భూసర్వేలోపాలపై జెడ్‌పిటిసి లేవనెత్తిన ప్రశ్నలకు డిప్యూటీ సర్వే అధికారి గోవిందరావు వివరణనిస్తూ, మండలంలోని 33 రెవెన్యూ గ్రామాలకుగాను 26 గ్రామాల్లో సర్వే పూర్తయింది. మిగిలిన 7 గ్రామాల్లో సర్వే ప్రారంభించామన్నారు వచ్చేఏడాది సెప్టెంబర్ నాటికి మొత్తం సర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. సమస్యలేని భూములకు త్వరితగతిన పట్టాలు జారీ చేస్తామన్నారు. వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ మాట్లాడుతూ, వేరుశనగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ, కొన్నిచోట్ల ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు త్వరలో నియామకాలకు నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. గంభీరం బీసీ కాలనీలో అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించినపుడు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం లేకపోవడంపై వైస్ ఎంపిపి బొట్టా ధనలక్ష్మి ప్రశ్నించారు. హౌసింగ్ ఎఇ శ్యాంసుందర్ ఇళ్ల నిర్మాణ పురోగతిపై వివరించారు. కొత్తగా 63 మంది సొంత స్థలం కలిగిన వారు ఇళ్లకుదరఖాస్తు చేసినట్లు వెల్లడించారు.

విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని ముకుందపురం సర్పంచ్ కలిమి గంగరాజు సభ దృష్టికి తెచ్చారు.విద్యుత్ సమస్యలపై ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపడుతున్నట్లు ఎఇ అప్పలనాయుడు తెలిపారు. జల జీవన మిషన్ కింద ఐదు జోన్లుగా విభజించిమేఘాద్రిగెడ్డ నుండి నీటిని సరఫరా ప్రణాళిక అమలులో ఉందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్ఎస్ఆర్ మూర్తి తెలిపారు.

ఎంపిడిఒ డాక్టర్ జానకి మాట్లాడుతూ, ఈనెల 21న విశాఖ ఆర్‌కె బీచ్‌లో యోగా దినోత్సవానికి మండలం నుంచి ఐదు వేలమందిని తరలింపునకు 160 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి శారదా ప్రియాంక మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు బొట్టా ధనలక్ష్మి, మజ్జి వెంకట్రావు, బిఆర్‌బి నాయుడు, బొట్టా రామకృష్ణ, కలిమి గంగరాజు, బంక శ్రీను, డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ పాల్గొన్నారు

మెజార్టీ సర్పంచుల గైర్హాజరు

మండల సర్వసభ్య సమావేశానికి మెజార్టీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరుతో మొక్కుబడిగా సాగింది. 26 సర్పంచ్‌లకు గాను కేవలం ఆరుగురైనా హాజరుకాలేదు. ఎక్కువమంది సర్పంచ్‌లు వైసిపికి చెందిన వారు కావడం, మండల పరిషత్ పాలకమండలిలో కూటమి అధికారంలో ఉండడంతో వీరంతా ముఖం చాటేశారని అంటున్నారు. అయితే సమస్యలను ప్రస్తావించి, పరిష్కారంచర్యలు చేపడతారని గెలిపిస్తే, ఇలా రాజకీయ లబ్ధితో మండల సభలకు సర్పంచ్‌లు, ఇతర నేతలు డుమ్మా కొట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

రావాడ-నునపర్తి రహదారిలో
అడుగడుగునా గోతులు

- గొల్లగరువు వద్ద చెరువును తలపిస్తున్న వైనం
- అవస్థలు పడుతున్న జనం, వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

గొల్లగరువు సమీపంలో గోతులతో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తున్న రహదారి

ప్రజాశక్తి-పరవాడ

వైసిపి ప్రభుత్వ హయాంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండేదని అప్పట్లో విపక్షంలో ఉన్న టిడిపి, జనసేన కూటమి నేతలు గగ్గోలు పెట్టారు. అధ్వాన రోడ్లకు సంబంధించి ఏకంగా జగనన్న రోడ్డు అనే ట్యాగ్ కూడా బాగా ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఇది గతం. ఇప్పుడు టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైంది. అయినా రోడ్ల పరిస్థితుల్లో ఏ మార్పూ లేదు. రావాడ-నునపర్తి ప్రధాన రహదారే దీనికి నిదర్శనం.

పరవాడ మండలం రావాడ పంచాయతీ పరిధిలో బొట్టవానిపాలెం మరిడిమాంబ గుడి నుండి రేఖవానిపాలెం వరకు రొడ్డుపై అడుగడుగునా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ప్రధానంగా ఎన్‌టిఆర్ కాలనీ సమీపాన గొల్లగరువు ప్రాంతం వద్ద రహదారి చెరువును తలపిస్తుంది. రహదారి అంతా గోతులమయమై వర్షాలు పడితే వాహనదారులు, కాలినడకన వెళ్లే ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ రహదారి పలు గ్రామాల ప్రజలకు ప్రధాన మార్గం. నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తూ ఉంటారు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి బాగుపడుతుందని ఆశించినా ఫలితం లేకపోయింది.

గడచిన సంక్రాంతి నాటికే రోడ్లపై గోతులనేవే కనిపించవని, రోడ్లన్నీ అద్దంలా మెరిసిపోతాయని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకటనల మీద ప్రకటనలు చేశారు. కాని రావాడ పంచాయతీ పరిధిలోని బొట్టవానిపాలెం మరిడిమాంబ గుడి నుండి రేఖవానిపాలెం వరకు ప్రధాన రోడ్డు దుస్థితిపై ఎవరూ దృష్టి పెట్టకపోవడం శోచనీయం. డబుల్ ఇంజన్ సర్కార్ కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, గ్రామాల రూపురేఖలు మారిపోతాయని చెప్పిన మాటలన్నీ నీటిమూటలగా మిగిలిపోయాయి. రావాడ-నునపర్తి ప్రధాన రహదారి దుస్థితి మారలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డు దుస్థితిపై దృష్టి పెట్టి బాగుచేయించి, ప్రజల కష్టాలను తీర్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

సోమవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజా సమస్యలు తెలుసుకోడానికే 'పల్లె నిద్ర'

ప్రజాశక్తి-కశింకోట : ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే పల్లె నిద్ర కార్యక్రమమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. కశింకోట మండలం పల్లపు సోమవరం గ్రామంలో సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రాత్రి బస చేశారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గోంతిని శ్రీనివాసరావు, సర్పంచ్ గోంతిని నాగరత్నం, కూటమి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, ఉల్లింగల రమేష్, సిదిరెడ్డి శ్రీను, నైనముశెట్టి రమణరావు, బలిజి ముసిలి నాయడు, మళ్ల బాబు, కర్రి గోవింద, సిదిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

శాప్ డైరెక్టర్‌గా బుచ్చిరాజు నియామకం

బుచ్చిరాజు

ప్రజాశక్తి-సబ్బవరం

ఎపి స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్‌గా మండలంలోని సబ్బవరంకు చెందిన జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్.రాజు (బుచ్చిరాజు) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం శాప్ కార్యదర్శి వినయ్‌చంద్ నుంచి ఉత్తర్వులు అందినట్లు పిబివిఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాప్ బోర్డులో 8 మంది డైరెక్టర్లు ఉండగా విశాఖ జిల్లా నుండి తనకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడుకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో యువకులు క్రీడల్లో రాణించేలా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. బుచ్చిరాజుకు శాప్ డైరెక్టర్ పదవి రావడం పట్ల కూటమి నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

యాక్షన్ తేసా కంపెనీ ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి-రాంబిల్లి

రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామంలో సెజ్ రెండో విడతగా సేకరించిన భూముల్లో 105 ఎకరాల్లో యాక్షన్ తేసా కంపెనీ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మంగళవారం భూమి పూజ చేశారు. రూ.200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ కంపెనీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,000 నుంచి 4,000 మంది వరకు ఉపాధి కలుగుతుంది. సకాలంలో నిర్మాణం పూర్తి చేసి సెజ్ నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, అధికారులు, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, కంపెనీ ప్రతినిధులు

వేతన బకాయిలు చెల్లించాలని
ఉపాధి హామీ కూలీల నిరసన

నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-రాంబిల్లి : ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద చేసిన పనులకు సంబంధించి బకాయి ఉన్న కూలి డబ్బులు చెల్లించాలని కోరుతూ మండలంలోని పంచదారల గ్రామంలో ఉపాధి హామీ కూలీలు సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ మాట్లాడుతూ ఎండనకా, వాననకా ఉపాధి హామీ కూలీలను కష్టపడి పని చేస్తుంటే నెలల తరబడి వారికి కూల డబ్బులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఇలా అయితే వారు బతుకుతారని ప్రశ్నించారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు టెంటు, మంచినీరు, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, సమ్మర్ అలవెన్స్, పనిముట్లు అలవెన్స్ చెల్లించడం లేదని తెలిపారు. ఇటువంటి ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రభుత్వాలు యోగాంధ్ర పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి, ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వారం రోజుల్లో ఉపాధి హామీ బకాయిలు చెల్లింపు

డ్వామా పీడీ పూర్ణిమాదేవి

ఎన్‌ఆర్‌ఇజిఎస్ అధికారులతో మాట్లాడుతున్న పూర్ణిమాదేవి

ప్రజాశక్తి-దేవరాపల్లి

వారం రోజుల్లోగా ఉపాధి హామీ బకాయిలు చెల్లించనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులు ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.243 కోట్లు బకాయి ఉందని, దీనిలో ఉపాధి కూలీలకు వేతనాల రూపంలో రూ.98 కోట్లు, మెటీరియల్ కాంపినెంట్ కింద రూ.145 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. మండలంలోని మారేపల్లి ఎస్.చేనులపాలెం సమీపంలో జరిగిన ఉపాధి పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభం కాక ముందే ఉపాధి పని దినాల లక్ష్యాన్ని చేరుకోడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ ఏడాది 124 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 33 లక్షల పనిదినాలు పూర్తి చేశామన్నారు. జిల్లాలోని 24 మండలాల్లో రెండు వేల ఎకరాల్లో రైతులు కోరిన 25 రకాలైన ఉద్యాన పంటల్ని సాగు చేసుందుకు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. గొయ్యి తవ్వి, మొక్క వేసిన దగ్గర నుంచి మొక్క ఎదిగేంత వరకు మూడేళ్ల పాటు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుందన్నారు. ఇప్పటి వరకు 1200 ఎకరాలను గుర్తించగా, మిగతా భూమిని జూలై నెలాఖరులోగా గుర్తిస్తామని తెలిపారు. ఒక్కొక్క పంట సాగుకు సుమారు రూ.56 వేల నుంచి రూ.150 లక్షల వరకు అయ్యే ఖర్చుని మూడేళ్ల పాటు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. భూగర్భ జలాల అభివృద్ధి, భూసారం పెరుగుదల కోసం 7,600 నీటి గుంతలు తవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 5,200 తవ్వడానికి అనుమతి ఇచ్చామని పేర్కొన్నారు. తవ్విన గుంతల గట్లపై 16 మొక్కలు సహా కూరగాయల్ని పండించాలని, తద్వారా పంట గుంత తవ్విన భూమి వృధా కాకుండా రైతుకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఆమె వెంట ఏపీడీ కె.శ్రీనివాసరావు, ఏపీఓ రుక్మిణీదేవి, ఈసీ కె.వెంకటేష్ తదితరులున్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-సబ్బవరం : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడ్ ఆర్గనైజేషన్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ జి.మీనా కుమారి అన్నారు. బాల్య వివాహాలపై సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అమృతపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా కుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమన్నారు. 18 సంవత్సరాలలోపు బాలికలకు విహహం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయని చెప్పారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కమిటీ జిల్లా కో కన్వీనర్ గొటివాడ సామ్రాట్ కుమార్, మహిళా పోలీస్ కె.మణికుమారి, అంగన్వాడీ టీచర్ రమణమ్మ, అరుణ, అచ్చియ్యమ్మ, పుష్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరం 10 రోజులు యువశక్తి క్యాంపులో భాగంగా దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ మాట్లాడుతూ మనం రక్తదానం చేయటం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడొచ్చని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ రవికుమార్ మాట్లాడుతూ రక్తాన్ని దానం చేయటం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి 3 నెలలకు రక్త దానం చేయొచ్చని చెప్పారు. ఈ శిబిరంలో ఎన్‌సిసి కేడేట్స్ ద్వారా 48 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. సబ్బవరం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జివి సత్యారాజ్ కేడేట్స్‌కు ఫైర్ సేఫ్టీ మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుభేదార్ మేజర్ శ్రీనివాసరావు, ఎన్‌సిసి అధికారులు, ఎన్‌సిసి క్యాడెట్స్, పిఐ సిబ్బంది, ఫైర్ సేఫ్టీ హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఎన్‌సిసి కేడెట్లు

పాస్టర్లతో మాట్లాడుతున్న సిపిఎం నేత ముత్యాలనాయుడు

సమైక్యతా ర్యాలీలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఉగ్రవాదానికి, యుద్ధోన్మాదానికి, పహల్గాం ఉగ్రదాడిని ఉపయోగించి మతోన్మాద విద్వేషాన్ని వ్యాప్తి చేసే యత్నాలకు వ్యతిరేకంగా, అన్ని మతాల వారు ఐక్యంగా ఉండాలని కోరుతూ జరుగు సమైక్యతా ర్యాలీలో భాగస్వాములు కావాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు విజ్ఞప్తి చేశారు. మాడుగుల నియోజకవర్గ పాస్టర్ల సంఘం సమావేశం కె.కోటపాడులో మంగళవారం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ముత్యాలనాయుడు మాట్లాడారు. సమైక్యతా ర్యాలీ ప్రాధాన్యత గురించి పాస్టర్ల సంఘాల నేతలకు తెలియజేశారు. అన్ని మతాల వారు ఐకమత్యంతో కలిసి ఉండాలని, నేడు ముస్లిములు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, బిజెపి అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎదుర్కొవాలని సూచించారు. మండలంలోని అన్ని మతాల వారు కలిసిమెలిసి సమైక్యతా ర్యాలీ నిర్వహించాలని, అందుకు సహకరించాలని పాస్టర్ల సంఘం నేతలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎర్రదేముడు, జి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా కేకులు కట్ చేసి ఆర్భాటాలు చేసే బదులు ప్రాణ వాయువును ఇచ్చే మొక్కలు నాటాలని ఆదర్శ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బి.త్రినాధరాజు అన్నారు. మండలంలోని నాగయ్యపేట సన్యాసి చెరువు వద్ద దుర్గాలమ్మ గుడి చెరువు గట్టులపై సంఘం ఆధ్వర్యాన డ్రాక్రా మహిళలు మంగళవారం మొక్కలు నాటారు. దుర్గమ్మ గుడి నుంచి ఆర్సీకై కేంద్రం వరకు అశోక, బాదం, తురాయి, రావి, వేప, రైన్ ట్రీ వంటి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జామి ఉమ, శేషు, రాజులమ్మ, రాము, బొడ్డు సత్యవమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కె.కోటపాడు : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం అన్నారు. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం పిలుపుమేరకు మంగళవారం ఇక్కడ అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాభ్యాసన నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఖాశీం ప్రారంభించారు. యోగా గురువు బండారు వెంకట రమణ మూర్తి విద్యార్థులు ఉపాధ్యాయులు, అధ్యాపకులచే పలు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల నూతన పరిపాలన అధికారి బోలెం సూర్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ సుమతి, పీఈటి పైడంనాయుడు, ఎన్ఎస్ఎస్ పీఓలు సీమునూరి రమణ, గాడి అప్పారావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా గురువుకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శారద నది ఒడ్డిన శాంతి పార్క్‌లో మంగళవారం అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్, నరిశే చిరంజీవి ఆధ్వర్యంలో యోగా గురువు పుల్లెట్ సతీష్‌ను సత్కరించారు. జాతీయస్థాయిలో మెడల్స్ సాధించిన చిన్నారులకు మెమొంటోలు అందజేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ కాండ్రేగుల నారాయణరావు చేతుల మీదగా చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మళ్ల భాస్కర్, రిటైర్డ్ ఎస్ఐ గోపాలరావు, నటభూషణ్ శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, బాబ్జీ మాస్టర్, దాడి జగన్, పలకా కాసులు, దాడి శ్రీను, లాయర్ పట్నాయక్, అబ్దుల్ కలాం సేవా సంఘం సభ్యులు, యోగ టీం సభ్యులు, శాంతి పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


చిన్నారులకు మెమోంటోలు అందించిన నిర్వాహకులు

కిశోర బాలల అభివృద్ధికి చర్యలు

తుమ్మపాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, బాలికలు తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

కిశోర బాలల అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి, సిడిపిఓ పి.ప్రభావతి పేర్కొన్నారు. స్థానిక మాధవ సదన్లో మంగళవారం మే 2 నుంచి జూన్ 10 వరకు నిర్వహించిన కిశోర బాలల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 11 నుంచి 18 సంవత్సరాల వయసు గల 20 మంది బాలబాలికలను ఒక గ్రూపు చొప్పున ఏర్పాటు చేసి వారికి పలు అంశాల పట్ల శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు మాట్లాడుతూ కిశోర బాలికల సంరక్షణకు పలు చట్టాలు ఉన్నాయన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ చిన్ననాటి నుండి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్, పోలవరపు త్రినాథ్, దాడి జగన్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పిడి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

తుమ్మపాలలో..

మండలంలోని తుమ్మపాల కర్రి వెంకటరమణయ్య నాయుడు కళ్యాణ మండపంలో మంగళవారం కిశోర బాలలు, వారి తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), ఆడారి గోవిందరావు, నడిపల్లి బోసు బాబు, ఎంపిటిసి సభ్యులు పంచదారల కన్నారావు, స్కూల్ కమిటీ చైర్మన్ పి.బలరాం పాల్గొన్నారు.

కశింకోట : కౌమార దశ బాలికలపై దృష్టి సాధించాలని కశింకోట ఎఎస్ఐ రమణమ్మ అన్నారు. కశింకోట కళ్యాణ మండపంలో కిశోర వికాసం వేసవి కార్యక్రమం ముగింపు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు పెదపాటి కళ్యాణి, మండల ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి రామచంద్రరావు, సూపర్ వైజర్ జాన్సీ రాణి, మహిళా పోలీస్ జయ భారతి పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో..

మండలంలోని తాళ్ళపాలెం అంగన్వాడీ కేంద్రం-3లో కిశోర వికాసం వేసవి కార్యక్రమం ముగింపు మంగళవారం జరిగింది. ముందుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సుచిత్ర ఆదిలక్ష్మి, మహిళా పోలీస్ గీత ప్రసన్న, ఎఎన్ఎం విజయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి అంగన్వాడీ కేంద్రం-2లో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమం అంగన్వాడి సూపర్వైజర్ ఎస్‌కెఎస్ మీరాబీ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో మహిళా పోలీస్ సరస్వతి, అంగనవాడీ టీచర్లు రామలక్ష్మి, అరుణ, ఉమాదేవి, నాగమణి, భారతి లక్ష్మి, జ్యోతి, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మునగపాక మండలం గవర్ల అనకాపల్లిలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో రావికమతం ఐసిడిఎస్ పిఒ రత్నం ఆధ్వర్యంలో కిశోర వికాసం వేసవి ముగింపు కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరెడ్డి మాణిక్యం, ఐసిడిఎస్ రత్నం, సూపర్వైజర్ సంతోషి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి : బాల్య వివాహాలు చేయొద్దని ఐసిడిఎస్ పిఒ శ్రీవిద్య సూచించారు. నక్కపల్లి కొత్తపేట అంగన్వాడీ కేంద్రంలో కిషోర్ బాలికల వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కిషోర్ బాలికల తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో కలుగు దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నేరమన్నారు. ఋతుస్రావ ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత,బాలల హక్కులు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లలిత, సత్యవతి, మహిళా పోలీస్ పద్మ, సునీత సీడ్ ఆర్గనైజర్ అమ్మాజీ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట మండలం దిబ్బిడితో ర్యాలీ చేస్తున్న దృశ్యం

గొలుగొండ : మండలంలోని ఏఎల్.పురం గ్రామంలో సిడిపిఒ శ్రీగౌరి ఆధ్వర్యంలో కిశోర్ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలు గల బాలికలకు, తల్లులకు బాల్యవివాహ నిర్మూలన, బాలికల విద్య అవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీతమ్మధార : కౌమారదశపై కిశోర బాలికలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ అర్బన్ మర్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జెఎన్‌టి జ్యోతి అన్నారు. మంగళవారం జివిఎంసి 53వ వార్డు నరేంద్ర నగర్ అంగన్వాడి కేంద్రంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ, సెషన్-12లో బాల్య వివాహాల నిర్మూలనపై సూచనలు చేశారు. కౌమార బాలికలను సాధికారిత, స్వావలంబన, రక్తహీనత సమస్యను అధిగమించేలా చైతన్యవంతం చేసి, చదువు, వృత్తి, ఆరోగ్యసంరక్షణలో వారికి సహాయపడి ప్రోత్సాహించడం, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి వారికి అవసరమైన అవగాహన కల్పించామన్నారు.కిశోర బాలికలతో పాటు వారి తల్లిదండ్రులను చైతన్యపరచడంపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో కిశోర టీం కన్వీనర్, మహిళా సంరక్షణ కార్యదర్శి స్వప్న, అంగన్వాడీ టీచర్లు, ఎఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నక్కపల్లిలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిఓ శ్రీవిద్య

హత్యాయత్నం కేసులో నిందితురాలి అరెస్టు

ప్రజాశక్తి-పరవాడ : లైవ్ ఇన్ రిలేషన్ పార్ట్‌నర్‌పై మరిగించిన నూనె పోసి హత్యాయత్నానికి ప్రయత్నించి, తప్పించుకుని తిరుగుతున్న నిందితురాలిని సోమవారం పరవాడ పోలీసులు పట్టుకున్నారు. పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ప్రకారం... గుంటూరు జిల్లా బ్రాడీపేటకు చెందిన గండికోట బాలకృష్ణ, శ్రీకాకుళం జిల్లా బుర్జా మండలం ఓవీ పేటకు చెందిన నక్క రవణమ్మ లైవ్ ఇన్ రిలేషన్‌లో ఉండేవారు. ఇద్దరూ పరవాడ మండలం సాలపువానిపాలెం గ్రామంలో సాలపు తాతారావు ఇంట్లో అద్దెకు నివాసముండేవారు. వారి మధ్య వ్యక్తిగత విభేదాల నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 22న రాత్రి సుమారు 3 గంటల సమయంలో నక్క రవణమ్మ వంట నూనెను పాన్‌లో మరిగించి బాలకృష్ణ ముఖం, కళ్లపై వేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం నిందితురాలు రాత్రి సమయంలోనే అక్కడి నుండి పరారైంది. సమాచారం అందుకున్న పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ మార్గదర్శకత్వంలో, పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యాన కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ వి.సత్యనారాయణ సోమవారం నిందితురాలిని అనకాపల్లి పుడిమడక జంక్షన్ వద్ద గుర్తించి అరెస్టు చేసి అనకాపల్లి కోర్టుకు తరలించారు. నిందితురాలు నక్క రవణమ్మ గతంలో కూడా బాలకృష్ణపై యాసిడ్ దాడికి పాల్పడిన ఘటనలో ప్రధాన నిందితురాలిగా ఉంది. సంబంధిత కేసు ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా బుర్జా పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉంది. బాలకృష్ణపై గతంలో దొంగతనానికి సంబంధించి పలు కేసులు నమోదయ్యాయి. నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు అద్దెకు ఇల్లు ఇవ్వడం సమాజానికి ప్రమాదకరమని, ఇళ్ల యజమానులు అద్దెకు ఇచ్చేముందు అద్దెదారుల పూర్తి వివరాలను సేకరించి, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ధ్రువీకరణ చేయించుకోవాలని పరవాడ పోలీసులు ఈ సందర్భంగా తెలియజేశారు.

రేషన్ సబ్ డిపో ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ ఎస్‌సి, బిసి కాలనీ వాసులకు రేషన్ సబ్ డిపో ఏర్పాటు చేయాలని స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు ఆ కాలనీ వాసులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇరువాడ గ్రామానికి రెండు కిలోమీటర్లు దూరంలో నివాసం ఉండడం వలన రేషన్ డిపోకు వెళ్లి సరుకులు తెచ్చుకోవడం కష్టంగా ఉందని వాపోయారు. దీనికి స్పందించిన తహసీల్దార్ చిన్నికృష్ణ ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి సబ్ డిపో ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బలిరెడ్డి సూర్యప్రసాద్, బలిరెడ్డి అప్పారావు, పొట్ల కృష్ణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లోవోల్టేజ్‌తో తాగునీటి ఇబ్బందులు

సమస్యను పరిష్కరించాలని లక్ష్మీపురం గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో లోవోల్టేజ్ విద్యుత్ సమస్య వల్ల తరచూ పంపు హౌస్ మోటర్లు కాలిపోవడంతో గత పది రోజులుగా గ్రామంలో మంచి నీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామానికి చెందిన పలువురు మహిళలు వాపోయారు. ఈ మేరకు మహిళలు మంగళవారం చేతి పంపు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గణపతి నాయుడు మాట్లాడుతూ విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో లోవోల్టేజ్ వల్ల తరచూ మోటర్లు మరమ్మతులు గురవుతున్నాయని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన విషయాన్ని మండల సమావేశంలో తెలియజేసినా అధికారులు సమస్యను పరిష్కరించలేదని పేర్కొన్నారు. దీంతో గ్రామంలో ఉన్న చేతి పంపుల నుండి మంచినీరు తోడుకొని తీసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించి గ్రామానికి మంచినీరు అందించాలని కోరారు.

చేతి పంపు వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

అనుచిత వ్యాఖ్యలపై కూటమి నేతల నిరసన

పాయకరావుపేటలో ర్యాలీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పాయకరావుపేట: రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి పత్రిక, ఛానెళ్ళను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పాయకరావుపేట పట్టణంలో కూటమి పార్టీల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మంగవరం రోడ్డు సెంటరులో గల పెదిరెడ్డి కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గౌతమ్ థియేటర్ సెంటర్ వరకూ ఈ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ , పార్టీ మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), టౌన్ ప్రెసిడెంట్ యాళ్ల వరహాలబాబు, పార్టీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, సాక్షి ఛానల్‌లో డిబేట్ నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేసారు. మంగళవారం టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో పెదగదిలి కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ కృష్ణకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, కెల్ల సునీత సత్యనారాయణ, మజ్జి రమణి, రేఖా జ్యోతి, కొండమ్మ, లలిత, టిడిపి నాయకులు గాడి సత్యం, బుడుమూరు గోవిందు, పోలారావు, అక్కరమాని రాంబాబు, ఒమ్మి అప్పలరాజు, ముగడ రాజారావు, మూది అప్పారావు, అచ్యుతరావు పాల్గొన్నారు.

చోడవరం : రాజధానిపై అనుచిత వ్యాఖ్యలపై మంగళవారం చోడవరంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కొత్తూరు జంక్షన్ నుండి ర్యాలీ నిర్వహించి స్థానిక తహశీల్దారు రామారావుకు వినతిపత్రం అందించారు. చోడవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళలకు స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, మజ్జి గౌరీ శంకర్, సకుర్ కోటేశ్వరరావు, తానవరపు శ్రీనివాసరావు, న్యాయవాది జి.కృష్ణవేణి, సురేష్ పాల్గొన్నారు.

స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న వైద్యులు

దోమల మందు స్ప్రేయింగ్

ప్రజాశక్తి -నక్కపల్లి : వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు దోమలు నివారించేందుకు స్ప్రేయింగ్ చేసినట్లు గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారులు తెలియజేశారు. నక్కపల్లి రెసిడెన్షియల్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, ఎస్సీ బీసీ హాస్టల్‌లో మంగళవారం సిబ్బందిచే దోమల నివారించేందుకు మందు స్ప్రేయింగ్ చేయించారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవులు అనంతరం స్కూలు తెరిచే ముందు దోమల నివారణకు దోమల మందు తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. వైసీపీ మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు మద్దపు కామునాయుడు(అబ్బాయి నాయుడు), వైసీపీ సీనియర్ కర్త గోలకొండ సాంబమూర్తి, వైసీపీ నాయకులు పెద్దాడ ప్రసాద్, మాడెం నాగేశ్వరరావు, బొద్దున రమణ, గోలకొండ నూకినాయుడు తదితరులు జనసేన పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రేగుబల్ల శివ ఆధ్వర్యంలో చేరిన వీరికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్‌బాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, పోలుపర్తి శ్రీనివాస్, పండ ప్రసాద్, ఉమా, గణేష్, వాసం వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో చిన తీనార్ల గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మత్స్యకార నాయకుడు కంబాల అమ్మోరయ్య, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహాయ సహకారంతో ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, హనుమాన్ చాలీసా, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వడ్డిస్తున్న నిర్వాహకులుం

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో ఉపమాక జంక్షన్ వద్ద సిఐ కుమారస్వామి ఆధ్వర్యంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాహనాల స్పీడు నియంత్రించేందుకుగాను స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు తగు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటును పరిశీలిస్తున్న సిఐ కుమారస్వామి

వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి -గొలుగొండ: విష జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం, ప్రైవేట్ వైద్య సిబ్బంది మానవ దృక్పథంతో వారానికి రెండు రోజులుగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు, గొలుగొండ మండల కార్యదర్శి జి.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నర్సీపట్నం నియోజవర్గ వ్యాప్తంగా మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో పేద మధ్యతరగతి కుటుంబాలు బాధ పడుతున్నారన్నారు. డిఎంహెచ్ఓ, కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ సిబ్బంది తక్షణమే స్పందించి పర్యవేక్షణ చేసి మండల పంచాయతీ గ్రామాల వారిగా తక్షణమే మెడికల్ క్యాంపులు ద్వారా మెరుగైన వైద్యం అందించాలన్నారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.మురికి కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ జల్లించాలన్నారు.

ఐదుగురు విద్యార్థినులకు ఎన్ఎంఎంఎస్

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు ఎనిమిదో తరగతి విద్యార్థినులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పొందేందుకు అర్హత సాధించారని పాఠశాల ఎన్ఎంఎంఎస్ సమన్వయకర్త పి నాగేశ్వరరావు మంగళ వారం తెలిపారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ సెకెండియర్ వరకు ఏటా రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం పొందుతారన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులు రిక్క రేష్మ, ఆర్ శ్రావ్య, బి లిఖిత, మాధురి సాహులను అభినందించారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పాయకరావుపేట: హిందూపురం శాసనసభ్యులు, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి కల్చరల్ యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చింతకాయల రాంబాబు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ , శ్రీరంగం వరహాలు, అనిశెట్టి శ్రీను, భద్రరావు, రావాడ గోవింద రెడ్డి, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో పండ్లు, రొట్టెలు ఇస్తున్న నాయకులు

అనకాపల్లి రూరల్ : సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో బాలకృష్ణ ఫ్యాన్స్, వాకర్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పోలిమేర నాయుడు నాయకత్వంలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం కార్మికులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెతకంశెట్టి శ్రీనివాసరావు, కాండ్రేగుల నూకరాజు, పొలిమేర నాయుడు, విల్లూరి అప్పలనాయుడు, మల్ల గణేష్, పెతకంశెట్టి జగన్మోహన్రావు, పిలా రమణారావు, వేగి రాము, సిలపరిశెట్టి భాస్కరరావు, శ్రీనివాసరావు, బొడ్డేడ శ్రీనివాసరావు, మద్దాల సత్తిబాబు ఎల్లపు సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లిలో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు , అభిమానులు

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా కేకు కట్ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పొలిమేర నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు, ఆడారి గోవింద రావు, కొణతాల రమణ బాబు, నడిపల్లి బోసు బాబు, పెతకం శెట్టి బలరాం, రాపేటి రాంకుమార్, వియ్యపు సింహాచలం యాదవ్, గొర్లి శ్రీనివాసరావు, పిల్లా సత్య గోవిందరావు, కొణతాల బాలరామస్వామి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యంలో వర్షం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిపింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా మోస్తరు వర్షం కురవగా సాయంత్రం వరకు చినుకులతో తేలికపాటి వర్షం కురిసింది. దీంతో, ఒక్కసారిగా వాతావరణం మారింది. అధిక ఉష్ణోగ్రతతో మండుతున్న ఎండలతో ఉక్కపోతకు గురవుతున్న గిరిజనులకు ఈ వర్షంతో వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం కలిగింది.

కురుస్తున్న వర్షం

అరకులోయ రూరల్: అరకులోయ మండల పరిసర ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. వాహనచోదకులు, పాదాచారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమాయమయ్యాయి. వరి నార్లు, కూరగాయలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖలో మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్

-బాధితుల నుంచి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్య,ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ ఉత్తరాంధ్రలో తన రెండో రోజు పర్యటనలో భాగంగా మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయా వినతులపై అక్కడికక్కడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు నెలవారీ జీతం చెల్లించడంతో పాటు ఇంటర్ జోనల్ బదిలీలకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజెస్ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల తన భర్త మృతి చెందారని, ముగ్గురు పిల్లలు తనను అనాథలా వదిలేశారని, వద్ధాప్య పింఛన్ అందించి ఆదుకోవాలని విశాఖకు చెందిన అవ్వా కాంతం విన్నవించారు. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తన భర్త మృతి చెందారని, తమ కుటుంబానికి చెందవలసిన ఆస్తిని అత్త, మామ,మరిది అన్యాయంగా కాజేశారని నగరానికి చెందిన రెడ్లదిన్నె శ్రావణి ఆవేదనతో ఫిర్యాదు చేశారు. ప్రతిపక్షనేతగా చంద్రబాబు 2020లో విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు వైసిపికి చెందిన కె.కెరాజు పర్యటన అడ్డుకుని నానా బీభత్సం సష్టించారని,పోలీసులు తూతుమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని తాటిచెట్లపాలెంకు చెందిన కె.గోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి గతంలో కేటాయించిన రెండున్నర ఎకరాల స్థలంలోనే శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో తమకు పసుపు-కుంకుమ కింద ఇచ్చిన 1.09 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని,ఈ భూమి తమకు వంశపార పర్యంగా వచ్చిందని,అయితే 2022లో జరిగిన రీసర్వేలో ఎఫ్‌ఎమ్ బీలో సదరు భూమి సబ్ డివిజన్‌ను తప్పుగా నమోదు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని విశాఖ శాతవాహననగర్‌కు చెందిన వై.వసంత లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ లంకలపాలెంలోని కోనేరు అభివద్ధి పనుల్లో రూ.1.20 కోట్ల నిధుల గోల్ మాల్ జరిగిందని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని 79 వ వార్డు కార్పోరేటర్ రౌతు శ్రీనివాస ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న మంత్రి లోకేష్

'పల్లా' కుటుంబానికి లోకేష్ పరామర్శ

ప్రజాశక్తి- సీతమ్మధార : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతికి రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలో సీతంపేటలోని పల్లా శ్రీనివాసరావు నివాసానికి చేరుకుని, పల్లా సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి లోకేష్ నివాళులు అర్పించారు. పల్లా శ్రీనివాసరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంచికి మారుపేరుగా మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం నిలిచారని, విశాఖ-2 ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశారని ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ భరత్, హోంమంత్రి వంగలపూడి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఉత్తరాంధ్ర ప్రాంత ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సంఘం నాయకులు

కెజిహెచ్ సూపరింటెండెంట్ వాణికి అభినందన

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఇసుకపల్లి వాణికి మంగళవారం పలువురు అభినందనలు తెలిపారు. సిజిహెచ్‌ఎస్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎ.ఎస్ రామం, అబిద్ హుస్సేన్, బిజెపి వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపకుల రవికుమార్, నగర మెడికల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ బి.భాగ్యలక్ష్మి, చొక్కాకుల రాంబాబు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కెజిహెచ్ అభివద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఎవిఎన్ కాలేజీ విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఎవిఎన్ కళాశాల ఇంటర్ (హెచ్ఇసి) విద్యార్థిని షేక్ రహీమున్నీసాకు షైనింగ్‌స్టార్ అవార్డు లభించింది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఎవిఎన్ కళాశాలలో ఆర్ట్స్ చదువుతున్న విద్యార్థిని అత్యధిక మార్కులు సాధించడం ఓ రికార్డు అని అక్కడివారు చెబుతున్నారు. పాతికేళ్ల తర్వాత ఈ కళాశాల నుంచి ఆర్ట్స్ అత్యధిక మార్కులు సాధించిన షేక్ రహీమున్నీసా ఎపి ప్రభుత్వం నుంచి అవార్డుకు అర్హత సాధించడం విశేషం. రాష్ట్ర,జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన అవార్డును, సర్టిఫికెట్‌ను కళాశాల కరస్పాండెంట్ ఎ.విఅదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు ఆమెకు అందజేశారు.కళాశాల అధ్యాపక బందం షేక్ రహీమున్నీసాను అభినందించారు.

అర్హులకు సేవలు అందించాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దర్తీ అభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పై గిరిజనులకు అవగాహన కల్పించాలని ఐటిడిఎ ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఐటిడిఎ వీడియో కాన్ఫరెన్సు హాలులో వైద్య ఆరోగ్యశాఖ, విడివికె, గ్యాస్, పంచాయతీ రాజ్, బ్యాంకులు, ఎంపిడిఒలు, తహశీల్దారులు, ఐసిడిఎస్, జిసిసి, వ్యవసాయ శాఖ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో దర్తీ ఆభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు ఐటిడిఎ పరిధిలో 260 గ్రామాలు పథకం అమలు చేయడానికి ఎంపికయ్యాయన్నారు. ఈనెల 15 నుండి 30వ తేదీ వరకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని చెప్పారు. అర్హులైన లబ్దిదారులకు ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, పిఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గృహాలు, పాఠశాలల నిర్మాణాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మానాలు, వైద్య ఆరోగ్య సేవలు అందించాలని చెప్పారు. ప్రధాన మంత్రి జనమన్ పథకం కింద ఆర్దిక చేకూర్పు కల్పించాలని చెప్పారు. గ్యాస్ కనెక్షన్లు లేని లబ్దిదారులను గుర్తించి పిఎం ఉజ్వల్ పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. ప్రతీ కుటుంబానికి బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలన్నారు. అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్న గ్రామాలలో ఉన్న అంతర్గత రహదారులు, విద్యుత్ సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు ఉన్నవి లేనివి పరిశీలించాలన్నారు.

పని గంటల పెంపు రద్దు చేయాలి

మానవ హక్కుల వేదిక డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల (సవరణ) బిల్ 2025 ద్వారా పనిగంటలను 10 గంటలకు పెంచుతూ చేసిన సవరణను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడాన్ని మానవహక్కుల వేదిక తీవ్రంగా ఖండించండి. ఈ మేరకు మానవహక్కుల వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఎపి, తెలంగాణ రాష్ట్రాల సమన్వయకర్త వి.ఎస్ కష్ణ ఒక ప్రకటన చేస్తూ ఈ బిల్లు కార్మికుల హక్కుల మీద, వారి ఆత్మగౌరవం మీద దాడిగా తాము భావిస్తున్నానన్నారు. ఈ బిల్లు తక్షణమే ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల చట్టం,1948ని సవరిస్తూ ప్రభుత్వం ఈ బిల్ ని ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆధునిక కార్మిక హక్కులకి 8 గంటల పనిదినం అనే హక్కు ఆయువుపట్టు లాంటిదన్నారు. ఈ సవరణ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వం రాజ్యాంగస్ఫూర్తిని అపహాస్యం చేస్తోందని తీవ్రంగా ఆరోపించారు.

ఆర్య వైశ్యులు చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనాలి

-రాష్ట్రమంత్రి టిజి భరత్

మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి భరత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్య వైశ్యులు మరింత చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ అన్నారు. మంగళవారం విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి భరత్‌ను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో పేదవారికి సహాయపడటంలో ఆర్యవైశ్యుల పాత్ర ఎన్నదగినదన్నారు. తొలుత దేవాలయానికి విచ్చేసిన మంత్రి టీజీ భరత్ గారికి ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.బి. బి కుమార్ శర్మ, ఆలయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు స్వాగతం పలికారు. అనంతరం కన్యకాపరమేశ్వరి దేవాలయ సంఘ అధ్యక్షుడు పెనుగొండ కామరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి భరత్ మాట్లాడారు. కార్యక్రమంలో నగరంలో ఆర్యవైశ్యుల ప్రముఖులు కంకటాల మల్లిక్,పైడా కష్ణ ప్రసాద్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు నేతి శ్రీనివాస్, కట్టమూరి సూర్యనారాయణ, కోశాధికారి దుర్గా నూకేశ్వరరావు, వాసవి కళ్యాణ మండప సంఘ అధ్యక్ష కార్యదర్శులు విన్నకోట రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే ఒక రోజు సమ్మె

ప్రజాశక్తి - విశాఖపట్నం : నీటి సరఫరా కార్మికులకు కౌన్సిల్ తీర్మానం ప్రకారం సెమిస్కిల్డ్, స్కిల్డ్ వేతనాల చెల్లింపునకు సంబంధించి అప్కాస్ అప్రూవల్ చేసినా ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ విభాగం వారు కొర్రీ వేశారు. సమస్య పరిష్కరించి వేతనాలు ఇప్పించాలని నీటి సరఫరా విభాగం గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించకపోతే 10 వ తేదీ అర్ధరాత్రి నుంచి ఒక్కరోజు 11వ తేదీన టోకెన్ సమ్మె నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. 11వ తేదీన నీటిసరఫరా నిలిపేస్తామని తెలిపారు.

నేడు ఎపిడబ్ల్యూజెఎఫ్ డిమాండ్స్ డే

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులు రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ డిమాండ్స్ డే పాటిస్తోందని ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా, బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ప్రత్యేక అతిథిగా హాజరవుతారన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి తెప్పోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్ట్ ఏరియాలోని వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ సమాకూర్చిన లాంచీలో శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని సముద్రంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొండపై నుండి కిందకు దించి పల్లకీలో ఉంచి సముద్రతీరం వరకు ఊరేగించారు. ఆలయ ఎగ్జిక్యూట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో తెప్పోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. కార్పొరేటర్ సాధిక్ పాల్గొన్నారు.

సముద్రంలో తెప్పోత్సవం

రక్తదాన శిబిరాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో పలు శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపుమేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి జి గౌరీశంకర్ పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన స్థానిక కాఫీ హౌస్ లో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు, డాక్టర్ షేక్ ఎండి షరీఫ్ అధ్యక్షతన ఆ శాఖ సమన్వయంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తు న్నారన్నారు. 13న పాడేరు మెడికల్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారని తెలిపారు. 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలోరక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు..